




# తొలివెలుగు

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం.. జాతీయ దినపత్రిక

తెలంగాణ జిల్లాలు

యాదాద్రిభువనగిరి | బుధవారం 9 సెప్టెంబర్ 2026



## 'ఛలో అసెంబ్లీ' భగ్నం

- బీఆర్ఎస్ నాయకుల అరెస్ట్
- రాజాపేట పోలీస్‌స్టేషన్‌లో నాయకుల నిరసన
- ప్రశ్నించే గొంతుకలను నొక్కుతున్నారని తిరుమలేష్ ధ్వజం

**తొలివెలుగు, రాజాపేట:** ఆరు గ్యారంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందంటూ బీఆర్ఎస్ రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చిన 'ఛలో అసెంబ్లీ' ముట్టడి కార్యక్రమానికి బయలుదేరిన పార్టీ నాయకులను మంగళవారం పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ఉదయం 6 గంటల నుంచే పలువురు నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకుని రాజాపేట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పోలీసుల ముందస్తు అరెస్టులను నిరసిస్తూ బీఆర్ఎస్ నాయకులు రాజాపేట పోలీస్‌స్టేషన్‌లోనే నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు సట్టు తిరుమలేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వం పాలనలో విఫలమైందని ప్రశ్నించే గొంతుకలను అణిచివేసేందుకు అక్రమ అరెస్టులకు పాల్పడటం సరికాదన్నారు. ప్రశ్నించే వారిని అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ప్రజా సమస్యలపై, ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుపై ప్రశ్నించడం ప్రతిపక్షాల బాధ్యత అని పేర్కొన్నారు. శాంతియుతంగా నిరసన మిగతా 2లో..

# చౌటుప్పల్‌లో జోరుగా బ్రాండెడ్ బియ్యం దందా!

2





- బియ్యం ఒకటే.. బ్రాండ్లు వేరు!
- ఒకే దుకాణంలో పదుల సంఖ్యలో బ్రాండ్లు
- పుట్టగొడుగుల్లా వెలుస్తున్న రైస్ డిపోలు
- ప్యాకింగ్, తూకం, నాణ్యతపై అనుమానాలు
- తనిఖీలు లేకపోవడంతో వ్యాపారుల ఇష్టారాజ్యం!

## ఎమ్మెల్సీలను తక్షణమే బర్తరఫ్ చేయాలి



- స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై వ్యాఖ్యలను ఖండించిన వెన్‌రెడ్డి రాజు
- ఎమ్మెల్సీ తాతా మధు, నవీన్‌లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్
- రాజ్యాంగబద్ధమైన స్పీకర్ పదవిని అవమానించడం సరికాదని వ్యాఖ్య
- కేసీఆర్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి

2





## తపస్'లో చేరిన పాతకోటి మధు

- రికార్డు స్థాయిలో సభ్యత్వాల నమోదు
- పీఆర్సీ, పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేయాలి

తొలివెలుగు, రాజాపేట :తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) ఆధ్వర్యంలో చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమం మంగళవారం రాజాపేట మండలంలోని పలు పాఠశాలల్లో కొనసాగింది. ఈ సందర్భంగా దూది వెంకటాపురం పాఠశాల ఫిజికల్ డైరెక్టర్, మండల క్రీడా కార్యదర్శి పాతకోటి మధు తపస్‌లో చేరి సభ్యత్వాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా తపస్ మండల అధ్యక్షుడు జానయ్య, కార్యదర్శి సత్యానంద్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు, ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 2023 నుంచి పెండింగ్‌లో ఉన్న పీఆర్సీని వెంటనే అమలు చేయడంతో పాటు పీఆర్సీ కమిషన్ నివేదికను తెప్పించుకుని ఉద్యోగులకు మిగతా 2లో..

## బిస్మాట్ అసోసియేషన్ మండల అధ్యక్షుడిగా చెరుకు లింగస్వామి

- ఏకగ్రీవంగా నూతన మండల కార్యవర్గం ఎన్నిక
- ప్రైవేట్ పాఠశాలల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా కృషి చేయాలి: పాగిడాల జలంధర్‌రెడ్డి

2



TGTEL/26/A6221
తొలివెలుగు
బుధవారం 9 సెప్టెంబర్ 2026

# చౌటుప్పల్‌లో జోరుగా బ్రాండెడ్ బియ్యం దందా!

**తొలివెలుగు, చౌటుప్పల్:** నిత్యావసర సరుకైన బియ్యం విక్రయాల్లో బ్రాండ్ల పేరుతో జరుగుతున్న వ్యాపారంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చౌటుప్పల్ పట్టణంలో ఒకే దుకాణంలో పదుల సంఖ్యలో వివిధ బ్రాండ్ల పేర్లతో బియ్యం విక్రయిస్తున్న పరిస్థితి కనిపిస్తోందని వినియోగదారులు చెబుతున్నారు. ఒకే రకమైన బియ్యాన్ని వేర్వేరు పేర్లు, రంగురంగుల ప్యాకెట్లతో మార్కెట్‌లోకి తీసుకొస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పట్టణంలో రైస్ డిపోలు, బియ్యం విక్రయ కేంద్రాలు రోజురోజుకూ పెరుగుతున్నప్పటికీ బియ్యం నాణ్యత, ప్యాకింగ్, తూకం, బ్రాండ్ల వివరాలు తదితర అంశాలపై సంబంధిత శాఖల తనిఖీలు తగిన స్థాయిలో జరగడం లేదనే విమర్శలు ఉన్నాయి. దీంతో అసలు బియ్యం ఎక్కడి నుంచి వస్తోంది? ఎవరు ప్యాక్ చేస్తున్నారు? బ్రాండ్ పేరుకు తగ్గ నాణ్యత ఉందా? అన్న ప్రశ్నలు వినియోగదారుల్లో తలెత్తుతున్నాయి.

**బియ్యం ఒకటే.. బ్రాండ్లు వేరు?**

ఒకే దుకాణంలో వివిధ పేర్లతో పదుల సంఖ్యలో బియ్యం బ్రాండ్లు అందుబాటులో ఉండటంతో వినియోగదారులు అయోమ యానికి గురవుతున్నారు. ఏ బ్రాండ్ నాణ్యమైన ది? ఏ ప్రాంతానికి చెందినది? ప్యాకెట్‌పై పేర్కొన్న వివరాలకు అనుగుణంగానే బియ్యం ఉందా? అన్నది సామాన్య వినియోగదారుడికి అంతుచిక్కని పరిస్థితిగా మారింది.

వివిధ ప్రాంతాల్లో పేరున్న బ్రాండ్ల పేర్లతో సంచులను ముద్రించి బియ్యాన్ని విక్రయి స్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అయితే ఇందులో వాస్తవం ఎంత అన్నది సంబంధిత అధికారులు తనిఖీలు నిర్వహించి, బియ్యం నమూనాలను సేకరించి పరీక్షిం చినప్పుడే తేలనుంది.

**ధరల్లో భారీ వ్యత్యాసాలు**

మార్కెట్‌లో బ్రాండెడ్ పేర్లతో విక్రయిస్తున్న బియ్యం ధరలు కిలోకు రూ.60 నుంచి రూ.80 వరకు ఉన్నాయని కొందరు వినియోగదారులు చెబుతున్నారు. పాత బియ్యం, కొత్త బియ్యం, రకం, నాణ్యత వంటి అంశాల ఆధారంగా ధరల్లో వ్యత్యాసాలు ఉంటున్నాయని వ్యాపారులు పేర్కొంటున్నప్పటికీ, వాస్తవ నాణ్య తకు అనుగుణంగానే ధరలు నిర్ణయిస్తున్నారా? అన్నది అధికారుల పరిశీలనతో స్పష్టమవాల్సి ఉంది.

**25 కిలోల బ్యాగ్.. తూకం సరిగ్గానే ఉందా?**

25 కిలోల బియ్యం బ్యాగులుగా విక్రయిస్తున్న సంచుల్లో నిజంగా 25 కిలోల బియ్యం ఉంటుందా? అన్న అనుమానాలను వినియోగదారులు వ్యక్తం చేస్తున్నారు. ప్యాకెట్‌పై పేర్కొన్న నికర బరువుకు అనుగుణంగా బియ్యం ఉందా లేదా అన్నది తూనికలు–కొలతల శాఖ అధికారులు తనిఖీ చేయాలని కోరుతున్నారు.

అలాగే బియ్యం ప్యాకెట్లపై తయారీదారు లేదా ప్యాకర్ వివరాలు, నికర పరిమాణం, ధర తదితర తప్పనిసరి వివరాలు సక్రమంగా ఉన్నాయా లేదా కూడా పరిశీలించాల్సిన అవసరం ఉందని వినియోగదారులు అంటున్నారు.

**రైస్ మిల్లులే అడ్డాగా వ్యాపారం?**

జిల్లాలోని పలు రైస్ మిల్లుల కేంద్రంగా వివిధ బ్రాండ్ల పేర్లతో బియ్యం వ్యాపారం సాగుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొందరు మిల్లర్లు తమ సొంత బ్రాండ్ల పేర్లతో బియ్యాన్ని మార్కెట్‌లోకి తీసుకొస్తున్నారని వ్యాపార వర్గాల్లో చర్చ జరుగుతోంది.

మరోవైపు రేషన్ బియ్యాన్ని పాలిషింగ్ చేసి సన్నబియ్యంగా మార్చి మార్కెట్‌లో విక్రయి స్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అయితే ఇవి ప్రస్తుతం ఆరోపణలుగానే ఉన్నాయని, సంబంధిత అధికారులు రైస్ మిల్లులు, గోదాములు, డిపోల్లో తనిఖీలు నిర్వహించి బియ్యం మూలాన్ని పరిశీలిస్తేనే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని స్థానికులు పేర్కొంటున్నారు.

**మూడు శాఖల తనిఖీలు అవసరం**

బియ్యం వ్యాపారంలో తలెత్తుతున్న అనుమా నాలను నివృత్తి చేసేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో తనిఖీలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

ఫుడ్ సేఫ్టీ అధికారులు బియ్యం నాణ్యత, ఆహార భద్రత, ప్యాకింగ్ తదితర అంశాలను పరిశీలిం చాలని, తూనికలు–కొలతల శాఖ 25 కిలోల బ్యాగుల తూకం, ప్యాకేజింగ్ వివరాలను తనిఖీ చేయాలని కోరుతున్నారు. అదే విధంగా రేషన్ బియ్యం అక్రమ మళ్లింపు లేదా నిల్వకు సంబంధించిన ఆరోపణలు ఉంటే పౌరసరఫరాల శాఖ క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

**తనిఖీలు జరిగితేనే అసలు విషయం వెలుగులోకి..**

చౌటుప్పల్ పట్టణంలోని రైస్ డిపోలు, బియ్యం గోదాములు, రైస్ మిల్లుల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి బియ్యం నమూనాలను సేకరించాలని వినియోగదారులు కోరుతున్నారు. బియ్యం ఏ మిల్లు నుంచి వచ్చింది? ఏ బ్రాండ్ పేరుతో ప్యాక్ చేశారు? ప్యాకెట్‌పై ఉన్న వివరాలు వాస్తవమేనా? నికర బరువు సక్రమంగా ఉందా? నాణ్యత ప్రమాణాలు పాటిస్తున్నారా? అన్న అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు.

**ప్రజల డిమాండ్:**

బియ్యం నాణ్యత, ప్యాకింగ్, తూకం, బ్రాండ్ వివరాలు, విక్రయ విధానం తదితర అంశాలపై సంబంధిత శాఖలు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు.

# ఎమ్మెల్సీలను తక్షణమే బర్తరఫ్ చేయాలి



**తొలివెలుగు, చౌటుప్పల్:** అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌లపై కఠిన చర్యలు తీసుకోవాలని, వారిని తక్షణమే ఎమ్మెల్సీ పదవుల నుంచి బర్తరఫ్ చేయాలని తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ ఛాంబర్ మాజీ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు డిమాండ్ చేశారు. మంగళవారం చౌటుప్పల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా వెన్‌రెడ్డి రాజు మాట్లాడుతూ.. అసెంబ్లీ స్పీకర్ పదవి రాజ్యాంగబద్ధమైనదని, ఆ పదవిలో ఉన్న వ్యక్తిపై వ్యక్తిగతంగా అనుచిత వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై ఎమ్మెల్సీలు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో భిన్నాభిప్రాయాలు ఉండవచ్చని, అయితే రాజ్యాంగ పదవులను గౌరవించడం ప్రతి ప్రజాప్రతినిధి బాధ్యత అని పేర్కొన్నారు. బీఆర్ఎస్ నాయకులు ఇప్పటికీ దొరల మనస్తత్వంతో వ్యవహరిస్తున్నారని వెన్‌రెడ్డి రాజు విమర్శించారు. ప్రజా సమస్యలపై నిర్మాణాత్మకంగా మాట్లాడాల్సిన ప్రజాప్రతినిధులు వ్యక్తిగత విమర్శలకు దిగడం సరికాదన్నారు. రాష్ట్రంలో ప్రజా సంక్షేమ పాలన కొనసాగుతుండటాన్ని ఓర్వలేకనే కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రజాప్రతినిధులపై బీఆర్ఎస్ నాయకులు విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు.

**ప్రజా సమస్యలపై చర్చించాలి**

ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధులు అసెంబ్లీ సమావేశాలకు హాజరై ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని వెన్‌రెడ్డి రాజు అన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి శాసనసభ వేదికగా పనిచేయాల్సిన బాధ్యత ఎమ్మెల్యేలపై ఉందని తెలిపారు. వ్యక్తిగత రాజకీయ విమర్శలకు బదులు ప్రజలకు ఉపయోగపడే అంశాలపై చర్చ జరగాలని సూచించారు. మాజీ సీఎం కేసీఆర్ అసెంబ్లీకి క్రమం తప్పకుండా హాజరై ప్రజా సమస్యలపై తన గళాన్ని వినిపించాలని అన్నారు. ఫామ్‌హౌస్‌కే పరిమితమై ప్రజల సొమ్ముతో ప్రభుత్వ సదుపాయాలు అనుభవిస్తూ అసెంబ్లీకి హాజరుకాకపోవడం సమంజసం కాదని వెన్‌రెడ్డి రాజు విమర్శించారు. ప్రజల సమస్యలపై సభలో పనిచేయలేని పక్షంలో కేసీఆర్ తక్షణమే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

**చర్యలు తీసుకోవాలి:**

స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీల వ్యవహారంపై సంబంధిత అధికారులు, శాసనసభ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని వెన్‌రెడ్డి రాజు కోరారు. రాజ్యాంగ వ్యవస్థల పట్ల ప్రజా ప్రతినిధులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. రాజకీయ విమర్శలు హద్దులు దాటి వ్యక్తిగత దూషణలకు దారితీయకుండా అన్ని పార్టీలు సంయమనం పాటించాలని కోరారు. స్పీకర్ పదవికి ఉన్న గౌరవాన్ని కాపాడటంతోపాటు ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆయన పేర్కొన్నారు. ఎమ్మెల్సీల వ్యాఖ్యలపై తగిన చర్యలు తీసుకుని భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని వెన్‌రెడ్డి రాజు కోరారు.

## 'ఛలో అసెంబ్లీ' భగ్నం

మొదటిపేజీ తరువాయి:

కార్యక్రమాల్లో పాల్గొనే నాయకులను ముందస్తుగా అరెస్టు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆయన విమర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల యువజన అధ్యక్షుడు, రఘునాథపురం సర్పంచ్ పల్లె సంతోష్‌గౌడ్, జలసాధన సమితి అధ్యక్షుడు ఎర్ర గోకుల జశ్వంత్, మాజీ సర్పంచులు బొంగోని ఉప్పలయ్య, చెరుకు కనకయ్య, పట్టణ అధ్యక్షుడు బెడిద వీరేశం, నాయకులు ములుగు సోమలింగం, సలావుద్దీన్, గంధమల్ల సురేష్, గజ్జల రాజు, మార్కశివ, గొర్రెంకల సాయి తదితరులు పాల్గొన్నారు.

## 'తపస్'లో చేరిన పాతకోటి మధు

మొదటిపేజీ తరువాయి:

న్యాయం చేయాలని కోరారు. అదేవిధంగా పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏలను తక్షణమే విడుదల చేయాలని, 2003 డీఎస్సీ ద్వారా నియమితులైన ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) వర్తింపజేయాలని విజ్ఞప్తి చేశారు. తపస్ సభ్యత్వ నమోదుకు ఉపాధ్యాయుల నుంచి విశేష స్పందన లభిస్తోందని, రికార్డు స్థాయిలో సభ్యత్వాలు నమోదవుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో తపస్ జిల్లా ఉపాధ్యక్షుడు పలుగుల రాజు, మండల గౌరవాధ్యక్షుడు నమిలే భరత్‌కుమార్ గౌడ్, ఉపాధ్యక్షుడు మాలోతు నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## బిస్మాట్ అసోసియేషన్ మండల అధ్యక్షుడిగా చెరుకు లింగస్వామి



**తొలివెలుగు, భూదాన్‌పోచంపల్లి:** ప్రైవేట్ పాఠశాలలు ఎదుర్కొంటున్న సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించుకుంటూ, విద్యార్థులకు నాణ్యమైన, ఉన్నత విద్యను అందించేందుకు పాఠశాలల యాజమాన్యాలు ఐక్యంగా కృషి చేయాలని బిస్మాట్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పాగిడాల జలంధర్‌రెడ్డి కోరారు. మంగళవారం భూదాన్‌పోచంపల్లి పురపాలక కేంద్రంలో బడ్జెట్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (బిస్మాట్) మండల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పాగిడాల జలంధర్‌రెడ్డి ఆధ్వర్యంలో నూతన మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన మండల అధ్యక్షుడిగా చెరుకు లింగస్వామి గౌడ్, కార్యదర్శిగా లింగస్వామి, కోశాధికారిగా ఎన్. సంజీవ్‌కుమార్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జలంధర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను సంఘం దృష్టికి తీసుకువచ్చి, వాటి పరిష్కారం కోసం సంఘటితంగా పనిచేయాలని సూచించారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు యాజమాన్యాలు నిరంతరం కృషి చేయాలని అన్నారు.

అనంతరం ఇటీవల మున్సిపల్ ఎన్నికల్లో కౌన్సిలర్‌గా ఎన్నికైన సభ్యుడు రావుల జంగయ్యను ఘనంగా సన్మానించారు. నూతనంగా ఎన్నికైన మండల కార్యవర్గ సభ్యులను శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బిస్మాట్ జిల్లా కార్యదర్శి చిట్టిబాబు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నోముల బస్వారెడ్డి, జిల్లా కోశాధికారి ప్రభాకర్‌రావు, నాయకులు మల్లేశం, కృష్ణ, రాజు, జానీ తదితరులు పాల్గొన్నారు.

# స్పీకర్ గౌరవాన్ని కించపరిస్తే సహించం

- తాతా మధు, నవీన్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి
- రాజ్యాంగ పదవులపై అనుచిత వ్యాఖ్యలు ప్రజాస్వామ్యానికి విరుద్ధం
- ప్రజా సమస్యలపై పనిచేయలేకపోతే కేసీఆర్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి: జువ్వి నర్సింహా

**తొలివెలుగు, చౌటుప్పల్:** అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌పై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని మాల మహానాడు చౌటుప్పల్ అధ్యక్షుడు, ధర్మోజిగూడెం సర్పంచ్ జువ్వి నర్సింహా డిమాండ్ చేశారు. అవసరమైతే వారిని ఎమ్మెల్సీ పదవుల నుంచి బర్తరఫ్ చేయాలని కోరారు. మంగళవారం చౌటుప్పల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా జువ్వి నర్సింహా మాట్లాడుతూ.. అసెంబ్లీ స్పీకర్ పదవి రాజ్యాంగబద్ధమైనదని, ఆ పదవిలో ఉన్న వ్యక్తిపై వ్యక్తిగతంగా అనుచిత వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై ఎమ్మెల్సీలు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో భిన్నాభిప్రాయాలు సహజమేనని, అయితే రాజ్యాంగ పదవుల




గౌరవాన్ని కాపాడటం ప్రతి ప్రజాప్రతినిధి బాధ్యత అని పేర్కొన్నారు.

**వ్యక్తిగత విమర్శలకు తావివ్వొద్దు:**

ప్రజా సమస్యలపై నిర్మాణాత్మకంగా మాట్లాడాల్సిన ప్రజాప్రతినిధులు వ్యక్తిగత విమర్శలకు దిగడం సరికాదని జువ్వి నర్సింహా అన్నారు. బీఆర్ఎస్ నాయకులు ఇప్పటికీ దొరల మనస్తత్వంతో వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రాజకీయ విభేదాలను ప్రజా సమస్యల పరిష్కారానికి ఉపయోగించుకోవాలే తప్ప, రాజ్యాంగ పదవుల గౌరవాన్ని దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేయకూడదని సూచించారు.

**సభకు హాజరై ప్రజల సమస్యలు ప్రస్తావించాలి:**

ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధులు శాసనసభ సమావేశాలకు క్రమం తప్పకుండా హాజరై ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని జువ్వి నర్సింహా కోరారు. ప్రజల సమస్యల పరిష్కారానికి శాసనసభను వేదికగా వినియోగించుకోవాల్సిన బాధ్యత ఎమ్మెల్యేలపై ఉందన్నారు. వ్యక్తిగత రాజకీయ విమర్శలకు బదులు ప్రజలకు ఉపయోగపడే అంశాలపై చర్చ జరగాలని పేర్కొన్నారు. మాజీ సీఎం కేసీఆర్ అసెంబ్లీకి హాజరై ప్రజా సమస్యలపై తన గళాన్ని వినిపించాలని అన్నారు. ప్రజలు ఎన్నుకున్న ఎమ్మెల్యేగా శాసనసభకు హాజరై తన బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు. ప్రజా సమస్యలపై సభలో పనిచేయలేని పక్షంలో కేసీఆర్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

**నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలి:**

స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యల వ్యవహారంలో శాసనసభ నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని జువ్వి నర్సింహా కోరారు. రాజ్యాంగ వ్యవస్థలు, వాటి పదవుల పట్ల ప్రజాప్రతినిధులు బాధ్యతాయుతంగా

వ్యవహరించాలని సూచించారు. రాజకీయ విమర్శలు హద్దులు దాటి వ్యక్తిగత దూషణలకు దారితీయకుండా అన్ని రాజకీయ పార్టీలు సంయమనం పాటించాలని కోరారు. స్పీకర్ పదవికి ఉన్న గౌరవాన్ని కాపాడడంతో పాటు ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఎమ్మెల్సీల వ్యాఖ్యలపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుని భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని జువ్వి నర్సింహా డిమాండ్ చేశారు.

# దళిత స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలా?

- ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌లను బర్తరఫ్ చేయాలి
- స్పీకర్ పదవిని కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం సరికాదు
- బీఆర్ఎస్ నేతలు దొరల అహంభావాన్ని వీడాలి
- పనిచేయలేని కేసీఆర్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి: సర్పంచ్ భీమిడి ప్రదీప్‌జీ



**తొలివెలుగు, చౌటుప్పల్:** శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌లను వెంటనే పదవుల నుంచి తొలగించాలని యాదాద్రి భువనగిరి జిల్లా, చౌటుప్పల్ మండలం స్వాములవారి లింగోటం గ్రామ సర్పంచ్ భీమిడి ప్రదీప్‌జీ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్పీకర్‌పై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా సర్పంచ్ భీమిడి ప్రదీప్‌జీ మాట్లాడుతూ.. శాసనసభ స్పీకర్ పదవి రాజ్యాంగబద్ధమైనదని, ఆ పదవిలో ఉన్న వ్యక్తిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజ్యాంగబద్ధ పదవులకు తగిన గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత ప్రతి ప్రజాప్రతినిధిపై ఉందని పేర్కొన్నారు. రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ వ్యక్తిగతంగా కించపరిచే వ్యాఖ్యలకు పాల్పడటం సరికాదన్నారు. బీఆర్ఎస్ నాయకులు ఇప్పటికీ దొరల అహంభావంతో వ్యవహరిస్తూ రాజ్యాంగ వ్యవస్థలను కించపరిచేలా మాట్లాడుతున్నారని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ఓర్వలేకనే బీఆర్ఎస్ నేతలు ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రజా సమస్యలపై నిర్మాణాత్మకంగా పోరాడాల్సిన ప్రతిపక్ష నాయకులు వ్యక్తిగత విమర్శలకు ప్రాధాన్యం ఇవ్వడం తగదన్నారు.

**రాజ్యాంగ పదవులను గౌరవించాలి:**

శాసనసభలో స్పీకర్ పాత్ర అత్యంత కీలకమని, సభా కార్యకలాపాలను నిబంధనల ప్రకారం నిర్వహించే స్పీకర్ వ్యవస్థను గౌరవించడం ప్రజాప్రతినిధుల బాధ్యత అని ప్రదీప్‌జీ అన్నారు. స్పీకర్‌పై చేసిన వ్యాఖ్యలపై సంబంధిత పార్టీ నాయకత్వం, శాసనసభ నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. రాజకీయ నాయకులు తమ స్థాయికి తగిన విధంగా బాధ్యతాయుతమైన భాషను ఉపయోగించాలని సూచించారు. ఒక వర్గానికి చెందిన ప్రజాప్రతినిధిని కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేయడం సమాజంలో అనవసరమైన చర్చలకు, ఉద్రిక్తతలకు కారణమయ్యే అవకాశం ఉందన్నారు. అందువల్ల ఇలాంటి వ్యాఖ్యలకు స్వస్తి పలికి ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని కోరారు.

**కేసీఆర్ రాజీనామా చేయాలి**

మాజీ సీఎం కేసీఆర్ వ్యవహారశైలిపైనా సర్పంచ్ భీమిడి ప్రదీప్‌జీ విమర్శలు చేశారు. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత అసెంబ్లీకి హాజరుకాకుండా ఫామ్‌హౌస్‌కే పరిమితమవుతున్నారని ఆరోపించారు. ప్రజల సమస్యలను శాసనసభలో ప్రస్తావించి పరిష్కారానికి కృషి చేయాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందన్నారు. ప్రజల నుంచి ఎన్నుకోబడిన పదవిలో కొనసాగుతూ విధులను నిర్వర్తించకుండా ఉండటం సమంజసం కాదని పేర్కొన్నారు. ప్రజల సొమ్ముతో సుమారు రూ.22 కోట్ల విలువైన రాయితీలు, సదుపాయాలు పొందుతున్నారంటూ ఆయన చేసిన ఆరోపణలపై కూడా సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. ఎమ్మెల్యేగా పనిచేయడం ఇష్టం లేకపోతే కేసీఆర్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరూ సమానమేనని, రాజ్యాంగం కల్పించిన హక్కులను గౌరవిస్తూ ప్రజా ప్రతినిధులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సర్పంచ్ భీమిడి ప్రదీప్‌జీ కోరారు. స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

### ఎమ్మెల్సీ తాతా మధును

# సస్పెండ్ చేయాలి

- దళిత స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు సరికావు
- ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి: తగరం నాగరాజు



**తొలివెలుగు, చౌటుప్పల్:** అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ తాతా మధును వెంటనే సస్పెండ్ చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా, చౌటుప్పల్ మండలం ఖైతాపురం గ్రామ కాంగ్రెస్ పార్టీ రెండో వార్డు సభ్యుడు, మాజీ గ్రామ శాఖ అధ్యక్షుడు తగరం నాగరాజు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దళిత సామాజిక వర్గానికి చెందిన స్పీకర్‌ను, రాజ్యాంగబద్ధమైన పదవిని కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేయడం తీవ్రంగా ఖండించదగిన విషయమని నాగరాజు అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజ్యాంగ పదవులకు గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. తాతా మధును ఎమ్మెల్సీ పదవి నుంచి తొలగించడంతో పాటు పార్టీ నుంచి కూడా తక్షణమే బర్తరఫ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. దళితులను అవమానించేలా బహిరంగంగా వ్యాఖ్యలు చేసినందుకు చట్టపరంగా విచారణ జరిపి, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలని కోరారు. ఇలాంటి వ్యాఖ్యలు మరోసారి పునరావృతం కాకుండా ప్రభుత్వం, సంబంధిత పార్టీ నాయకత్వం కఠిన చర్యలు తీసుకోవాలని నాగరాజు సూచించారు. రాజ్యాంగ పదవుల్లో ఉన్న వ్యక్తుల గౌరవాన్ని కాపాడటంలో ఎలాంటి రాజీ ఉండకూడదని ఆయన పేర్కొన్నారు.ఎమ్మెల్సీ తాతా మధును సస్పెండ్ చేయాలి.

## బాధిత కుటుంబానికి 'జెల్ల పరమేష్ యువసేన' ఆర్థిక సాయం

- బాధిత కుటుంబానికి రూ.5 వేల అందజేత
- కుటుంబ సభ్యులను పరామర్శించిన యువసేన సభ్యులు



**తొలివెలుగు, రాజాపేట:** రాజాపేట మండల పరిధిలోని బేగంపేట గ్రామానికి చెందిన చింతకింది లక్ష్మి ఇటీవల మృతి చెందడంతో ఆమె కుటుంబాన్ని మంగళవారం 'జెల్ల పరమేష్ యువసేన' సభ్యులు పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి యువసేన తరపున రూ.5,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. లక్ష్మి మృతి పట్ల కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేసిన యువసేన సభ్యులు.. ఈ కష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని సూచించారు. బాధిత కుటుంబానికి తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో యువసేన సభ్యులు మూల రాములు, ప్యాట రమేష్, జామచెట్టు వెంకటేష్, మూల హరినాథ్, ఒరుగంటి నాగురాజు, మూల శ్రీను, మూల మల్లేశం, మూల సత్యం, దేవి మల్లేష్ పాల్గొన్నారు.

TGTEL/26/A6221
తొలివెలుగు
బుధవారం 9 సెప్టెంబర్ 2026

# కాంగ్రెస్ పాలనకు చరమగీతం పాడాలి!



- మహిళా ఎమ్మెల్యేలపై పోలీసుల దురుసుతనానికి ప్రభుత్వం క్షమాపణ చెప్పాలి
- మునుగోడు ఎమ్మెల్యే వైఫల్యంపై నిలదీస్తాం
- మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి



**తొలివెలుగు, మునుగోడు:** శాసనసభకు వెళ్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పోలీసులు అడ్డుకోవడం, మహిళా ఎమ్మెల్యేల పట్ల దురుసుగా వ్యవహరించారంటూ ఆరోపణలు రావడాన్ని నిరసిస్తూ మంగళవారం మునుగోడు నియోజకవర్గ కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జి కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మహిళలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో ప్రజల హక్కులు, సంక్షేమం, అభివృద్ధి కోసం మరోసారి సమష్టిగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. ప్రభుత్వ పాలనా వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రజా సమస్యలపై పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరుపై ప్రభుత్వం వెంటనే క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. మహిళల పట్ల నిజమైన చిత్తశుద్ధి ఉంటే మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఈ ఘటనను ఖండించి బాధిత మహిళా ఎమ్మెల్యేలకు సంఘీభావం ప్రకటించాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన కేసీఆర్‌పై విమర్శలు చేసే ముందు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన స్థాయిని గుర్తుంచుకోవాలని ప్రభాకర్‌రెడ్డి వ్యాఖ్యానించారు. మునుగోడు నియోజకవర్గ అభివృద్ధిని స్థానిక ఎమ్మెల్యే గాలికి వదిలేశారని ఆరోపించారు. నియోజకవర్గంలోని ప్రజా సమస్యలు, అభివృద్ధి అంశాలపై ఎమ్మెల్యేను నిలదీస్తామని స్పష్టం చేశారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి రాబోయే రోజుల్లో ప్రజలే తగిన సమాధానం చెబుతారని ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు.

## దివిస్ ఉచిత వైద్య శిబిరం అభినందనీయం




- విద్యార్థులకు ఉచిత వైద్య పరీక్షలు, మందులు, నోట్ పుస్తకాల పంపిణీ
- జైకేసారం, అస్సోనిగూడెం ప్రభుత్వ పాఠశాలల్లో వైద్య శిబిరం
- ప్రారంభించిన సర్పంచ్ సమిరెడ్డి భారతమ్మ జనార్దన్‌రెడ్డి

**తొలివెలుగు, చౌటుప్పల్:** విద్యార్థులు అనారోగ్యాల బారిన పడకుండా ముందస్తుగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం అభినందనీయమని సర్పంచ్ సమిరెడ్డి భారతమ్మ జనార్దన్‌రెడ్డి అన్నారు. చౌటుప్పల్ మండలం జైకేసారం, అస్సోనిగూడెం గ్రామాల్లోని జిల్లా పరిషత్, ప్రాథమిక ప్రభుత్వ పాఠశాలల్లో దివిస్ పరిశ్రమ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించారు. ఈ శిబిరాలను సర్పంచ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యులు జయంత్‌కుమార్, నరేష్ విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన విద్యార్థులకు ఉచితంగా మందులను అందజేశారు. రెండు పాఠశాలల్లో సుమారు 260 మంది విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించడంతో పాటు నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు పరిశ్రమల ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల పాఠశాల స్థాయిలోనే ఆరోగ్య సమస్యలను గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకునే అవకాశం ఉంటుందని సర్పంచ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ స్వాతి వెంకటేష్, వార్డు సభ్యులు మణికంఠచారి, చంద్రారెడ్డి, పుష్పలత జంగయ్య, స్వాతి బాలరాజు, గణేష్, జయసుధ జంగయ్య, తేజస్వి లింగారెడ్డి, దివిస్ పరిశ్రమ ప్రతినిధులు జి.వెంకటేశ్వర్లు, జె.శివకృష్ణ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## దొరల అహంకారానికి నిదర్శనం

- దళిత స్పీకర్‌ను అవమానిస్తే సహించేది లేదు
- రూ.22 కోట్ల వసతులు అనుభవిస్తూ సభకు రారా?
- సుర్వి నరసింహా గౌడ్ ధ్వజం



**తొలివెలుగు, చౌటుప్పల్:** స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై అనుచిత వ్యాఖ్యలకు ఒడిగట్టిన ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌లను వెంటనే బర్తరఫ్ చేయాలని కాంగ్రెస్ పార్టీ మాజీ మున్సిపల్ అధ్యక్షుడు సుర్వి నరసింహా గౌడ్ డిమాండ్ చేశారు. చౌటుప్పల్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నాయకులు దొరల మనస్తత్వాన్ని వీడాలని హితవు చెప్పారు. స్పీకర్‌పై వ్యక్తిగత దూషణలకు దిగడం వారి దిగజారుడు రాజకీయాన్ని తెలియజేస్తోందన్నారు.రూ.22 కోట్ల విలువైన రాయితీలు అనుభవిస్తూ సభకు రాకుండా ఫామ్‌హౌస్‌లో విశ్రాంతి తీసుకుంటున్న కేసీఆర్‌కు ప్రజల సమస్యలు పట్టవా అని నిలదీశారు. శాసనసభ సభ్యుడిగా బాధ్యతలు నిర్వర్తించలేకపోతే కేసీఆర్ వెంటనే రాజీనామా చేయాలని స్పష్టం చేశారు. సభ గౌరవాన్ని మంటగలిపిన ఎమ్మెల్సీలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.